
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 14 జనవరి 2025



ఊరూ వాడా సంక్రాంతి





నల్లగొండలో ముగ్గు వేస్తున్న యువతి

» సందడిగా భోగి వేడుకలు » ఇంటి ముందు వెల్లివిరిసిన రంగవల్లులు
» హరిదాసు కీర్తనలు » ● పతంగుల ఎగురవేతలో యువత, పిల్లలు

ఆకాశంలో ఉన్న రంగులు వాకిటవాలి సింగడైన వేళ, ఆడపడుచుల సందడికి ప్రకృతి పులకించిన సమయాన చిన్నా, పెద్ద అంతా సంబురమే. కొత్త అల్లుళ్లరాక, కోడి పందేల సందడి. బసవన్నల సంచారం, హరిదాసులు కీర్తనలతో సరదాల సంక్రాంతి సంబురాలు మొదలయ్యాయి. మూడు రోజుల ముచ్చటైన పండగలో సోమవారం భోగి వేడుకలను అంతా ఘనంగా జరుపుకున్నారు. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభానికి ముందు రోజు కష్టాలు తొలగిపోయి, అన్నీ శుభాలు సంప్రాప్తించాలని కోరుతూ భోగా మంటలు వేశారు. ఈ మంటల్లో చెడును వదలించుకోవడానికి పాత సామాగ్రిని దహనం చేయడం సంప్రదాయం. ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో సోమవారం తెల్లవారు జామునుంచే వేడుకలు మొదలయ్యాయి. ఊరు, వాడల్లో భోగి మంటలు వేసి సంబురాలు జరుపుకున్నారు. అదేవిధంగా నేడు జరిగే సంబురాల సంక్రాంతికి అంతా సిద్ధమయ్యారు. రేపు కనుమకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులువేసి, ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను పసుపు, కుంకుమలు, పుష్పాలతో అలంకరించారు. ఇంటికి చేరిన ఆడపడుచులు, బంధువులు, ముగ్గులతో ఇంటి ప్రాంగణాలను తీర్చిదిద్దడంతో ప్రతీ ఇళ్లూ పండుగతో కళకళలాడుతోంది.

- నల్లగొండ కల్చరల్



సకల జనులకు పండుగే

ఈ నెల 26న నాలుగు పథకాల అమలుకు శ్రీకారం »
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 42వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు »
భూమిలేని కూలీలకు ఆత్మీయ భరోసా »
కొత్త రేషన్ కార్డుల మంజూరు »
సాగులో ఉన్న భూమికి రైతు భరోసా »



రాష్ట్ర ప్రభుత్వం ఈ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అదేవిధంగా 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు కొత్త పథకాలను అందించేందుకు అన్నిఏర్పాట్లను పూర్తిచేసింది. గడిచిన ఏడాది కాలంలో 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ అందజేస్తూ వచ్చింది. తాజాగా ఏకంగా నాలుగు ప్రజాప్రయోజనంగా ఉన్న పథకాలను అమలు చేయనుండటంతో ఉమ్మడి జిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

- మిగతా 6వ పేజీలో...

ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు



హుజూర్‌నగర్ : రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి. పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు పెద్ద పీట వేశాం. రాష్ట్రంలో రైతులు పెద్ద మొత్తంలో పంట దిగుబడి సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు అండగా ఉంటుంది. రూ.2 లక్షల రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కింది. రైతుభరోసా పూర్తిస్థాయిలో అమలు చేస్తాం. హుజూర్‌నగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. రాష్ట్రంలోని జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉంది. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.

- నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి

సౌభాగ్యాల సంక్రాంతి కావాలి..



నల్లగొండ టౌన్ : తెలుగువారందరికీ సంక్రాంతి పండగ శుభాకాంక్షలు. సంక్రాంతి, కనుమ పండుగలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, కుటుంబ సమేతంగా జరుపుకోవాలి. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమం, సుపరిపాలన ప్రగతిపథంలో ముందుకు సాగుతున్న తరుణంలో ప్రజలంతా స్వేచ్ఛా, సౌభాగ్యాలతో సంబురంగా సంక్రాంతిని జరుపుకోవాలి. ప్రజాస్వామ్యబద్ధంగా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజాప్రభుత్వానికి దేవుడి ఆశీస్సులు సంపూర్ణంగా ఉండాలని కోరుకుంటున్నా.

- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి

వాహనాలు తగ్గుముఖం
రహదారి ప్రశాంతం
» సొంతూళ్లకు చేరిన పట్నంవాసులు
» బోసిపోయిన టోల్‌గేట్లు



6

సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలి
● యాదగిరిగుట్టలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్



7

బాల్యం, విద్యాభ్యాసం నాగార్జునసాగర్‌లోనే..
● మంద జగన్నాథానికి ఈ ప్రాంతంతో విడదీయరాని బంధం



7

కల్యాణం.. కమనీయం..

» గోదాదేవి, రంగనాయకస్వాముల కల్యాణం » పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దంపతులు



కల్యాణోత్సవంలో మాంగళ్యధారణ తంతు





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దంపతులు, కలెక్టర్ ఇలా త్రిపాఠి దంపతులు

నల్లగొండ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస మహోత్సవంలో భాగంగా రెండో భద్రాద్రిగా పేరొందిన నల్లగొండ జిల్లా కేంద్రంలో ని రామగిరి శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో గోదా, రంగనాథస్వామి దివ్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సోమవారం రాత్రి శ్రీగోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాన్ని రమనీయంగా నిర్వహించారు. భక్తులతో ఆలయం కిక్కిరిసింది. భాష్యం జగన్నాథచార్యులు, స్థానాచార్యులు రామ రంగాచార్యల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరయ్యారు. అర్చకస్వాములు తొలత స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలు, సకల అభరణాలతో దివ్య మనోహరంగా అలంకిరించి కల్యాణవేదిక పైకి తీసుకువచ్చి ఆశీనులు చేశారు. వేదపండుతులు ధనుర్మాస వ్రత ప్రాశస్త్యాన్ని వివరించారు. కల్యాణోత్సవంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దంపతులు అధికారికంగా స్వామి, అమ్మవార్లకు సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. కల్యాణ పీటలపై కూర్చుని తిలకించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి దంపతులు పట్టువస్త్రాలు అందజేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో కల్యాణానికి హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడి ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో బుర్రి చైతన్యశ్రీనివాస్, మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఏఎస్‌పీ రాములునాయక్, ఆలయ ఈవో జయరామయ్య, ఆర్డీవో అశోక్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ యామా కవితాదయాకర్, వంగాల అనిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పాశం రామిరెడ్డి, డీసీసీడీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, ఏసీ భాస్కర్, మాజీ చైర్మన్ చకిలం వేణుగోపాల్‌రావు సంధ్యారాణి, పాల్గొన్నారు. పెంటయ్య బ్యాండ్ విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా మిర్యాగూడరోడ్డులోని ఆనంద్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గోదారంగానాయకస్వామి కల్యాణాన్ని అర్చకస్వాములు శ్రీనివాసాచార్యులు, రఘునందర్‌చార్యులు ఘనంగా నిర్వహించారు. పుస్తెమెట్టలను, పట్టువస్త్రాలను జ్యోతి, హర్షవర్ధన్ దంపతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారం గోపాల్‌రెడ్డి, కార్యదర్శి యాద వాసుదేవ్, మేరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

చెర్వుగట్టు గుట్టపైకి పార్వతీ అమ్మవారు

పూర్వకాలం నుంచి వస్తున్న సంప్రదాయం



పల్లకి సేవతో పార్వతీ అమ్మవారిని గుట్టపైకి చేర్చుతున్న అర్చకులు భక్తులు

నార్కట్‌పల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రమైన చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడలరామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో వచ్చే నెల మొదటివారంలో జరిగే స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది. దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ సహార్చకులతో కలిసి ప్రత్యేక పూజలనంతరం గుట్ట కింద ఆలయంలో ఉండే పార్వతీమాత ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాలు, భక్తుల శివన్నామస్మరణలు, భజన బృందాల కోలాటాల మధ్య పల్లకి సేవతో సోమవారం గుట్టపైకి చేర్చారు. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సంక్రాంతి పండుగలో మొదటి రోజైన భోగి వేడుక రోజున పులగం ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించి పార్వతీ అమ్మవారిని గుట్టపైన ఉన్న పరమేశ్వరుడి చెంతకు చేర్చడం పూర్వం నుంచి సంప్రదాయంగా వస్తోంది. ఈ వేడుకతో దేవస్థానంలో బ్రహ్మోత్సవాల అంకం మొదలుకానుంది. వేడుకలో ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దారిని కమ్మేసిన మంచు

» ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు
» సమీప వాహనం కనిపించనంతగా పొగ



మూడు రోజులుగా రాత్రింబవళ్లు వాహనాల మోతతో మారుమోగిన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఒక్కసారిగా నిశబ్ధ వాతావరణం నెలకొంది. దీనికి తోడు సోమవారం తెల్లవారుజాము నుంచి విపరీతమైన పొగమంచు రహదారిని కమ్మేసింది. ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు ఉండిపోయింది. సమీపంలోని వాహనాలు కూడా సరిగ్గా కనిపించకపోవడంతో వాహనదారులు నెమ్మదిగా ముందుకు కదిలారు.

- చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి

సంక్రాంతికి వచ్చేశాం..

» ఎల్లలుదాటినా సొంతూరిపై మమకారం » కుటుంబాలతో సహా స్వగ్రామాలకు రాక



ఎల్లలు దాటినా వారికి సొంతూరిపై ఏమాత్రం మమకారం తగ్గలేదు. ఉద్యోగ వేటలో వారు అమ్మానాన్న, అన్నవదినలు, బంధువులను వదిలి వేల వేల మైళ్లదూరం వెళ్లారు. బంధువులు, కుటుంబసభ్యుల యోగాక్షేమాలు తెలుసుకునేందుకు వీడియో కాల్ ఒక్కటే మార్గం. అయినా ఎక్కడో మనసుకు కొంత వెలితిగా ఉండేది. చాలా కాలం నుంచి విదేశాల్లో ఉంటూ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు దూరంగా ఉంటున్నారు. సంకాంత్రి పండగకు సొంతూరికి వెళ్లి అందరినీ కలుస్తామన్న సంతోషంతో బయలుదేరి వచ్చేశారు. స్వగ్రామానికి వచ్చిన వారిని సొంతూరిలో అందరూ ఆప్యాయంగా పలకరించారు. తన వాళ్లను చూసి భావోద్వేగానికి గురయ్యారు. బంధువులు, కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి ఆనందంగా సంకాత్రి పండుగ జరుపుకున్నారు.

- (ఆంధ్రజ్యోతి,- నల్లగొండ, నార్కట్‌పల్లి)



కుటుంబసభ్యులతో సంతోషంగా..

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రానికి చెందిన ప్రవాస భారతీయుడు గట్టు వంశీ బీ.టెక్ పూర్తిచేసి ఎంఎస్ చేసేందుకు 2014లో అమెరికా వెళ్లాడు. తర్వాత 2016లో ఒకసారి ఇండియాకు వచ్చి తిరిగి వెళ్లాడు. కరోనా సమయంలో తన యోగక్షేమం గురించి కుటుంబ సభ్యులు ఆందోళన చెందేవారు. తర్వాత 2021లో వచ్చి వివాహం చేసుకుని సతీమణితో కలిసి వెళ్లి ప్రస్తుతం అమెరికాలోని డెట్రాయిట్ నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. మూడేళ్ల తర్వాత తన భార్య రాగిణి, కొడుకు ఇషాన్‌సాయితో కలిసి సంక్రాంతి పండుగ కోసం ఈనెల 10వ తేదీన నార్కట్‌పల్లికి వచ్చాడు. ఇన్ని రోజులు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు దూరంగా ఉన్న వంశీ స్వగ్రామానికి వచ్చి వారందరినీ కలిసి సంక్రాంతి పండుగను ఆనందంగా ఆస్వాదిస్తానంటున్నాడు. అమెరికాలో ఉన్న తెలుగువారితో కలిసి ఎన్ని పండుగలు జరుపుకున్నా కుటుంబ సభ్యులతో కలిసి పండుగ చేసుకోవడంలో ఉన్న ఆనందం అక్కడ ఉండదంటున్నాడు. సంక్రాంతి పండుగకు తమ కుమారుడు కోడలు మనవడు ఇంటికి రావడమే మాకు సంక్రాంతి కంటే పెద్ద పండుగలా అనిపించిందని తల్లిదండ్రులు గట్టు రమేశ్, జ్యోతి, అన్నా వదినలు వికాస్ ఇంద్రజ ఆనందం వ్యక్తం చేశారు.

ఎక్కడున్నా సొంతూరిపై మమకారం



కరోనా సమయంలో నేను అమెరికాలో ఉన్నా.. ప్రతి రోజూ కుటుంబసభ్యుల ఆలోచించే వాడిని. కుటుంబ సభ్యులతో గడిపిన జ్ఞాపకాలతో అమెరికా వెళ్లి మళ్లీ పండగ కోసం రావడం సంతోషంగా ఉంది. ఉద్యోగ రీత్యా ఎక్కడో దూర తీరాన నివసిస్తున్నా నా వాళ్ల గురించి ఆలోచిస్తూనే ఉంటా.

- గట్టు వంశీ, నార్కట్‌పల్లి.

అత్తగారింట్లో సంక్రాంతి జరుపుకోవడం ఆనందంగా ఉంది



నల్లగొండలోని ఆదర్శ కాలనీలో మా అత్తగారింట్లో సంక్రాంతి పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని, కొత్త అనుభూతినిచ్చింది. పెళ్లి అయిన తర్వాత ఇది మొదటి సంక్రాంతి. నా భర్త శ్రీచరణ్‌తో కలిసి అమెరికాలో ఉంటున్నాను. జార్జియాలో వర్క్ చేస్తున్నాను. ప్రత్యేకంగా సంక్రాంతి పండుగను జరుపుకోవడం కోసం సొంత దేశానికి, సొంత రాష్ట్రానికి, సొంత ఊరుకు రావడం మర్చిపోలేదు. వృత్తి, ఉద్యోగ రీత్యా విదేశాల్లో ఉన్నప్పటికీ మన తెలంగాణ సాంప్రదాయాలను పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది. మన సంస్కృతిని విదేశాల్లో సైతం చాటి చెప్పుకోవడానికి మనం గర్వపడాలి. సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులు జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది.

- వినూషశ్రీచరణ్, ఎన్ఆర్ఐ

సంక్రాంతి పండుగ ఎంతో ప్రత్యేకమైనది...



తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ఎంతో ప్రత్యేకమైనది. ఇది రైతుల పండుగ. ప్రతి ఒక్కరూ తెలుగుబాష, సంస్కృతి, సంప్రదాయాలను పండుగల విశేషాలను, ఔనత్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలి. తాను యుఎస్‌లో సీనియర్ సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాను. సంక్రాంతి పండుగను మా కుటుంబ సభ్యులు మధ్య జరుపుకునేందుకు కోసం నల్లగొండకు వచ్చాను. మా బంధువులు, నాతోపాటు నల్లగొండలో చదువుకున్న చిన్ననాటి స్నేహితులను కూడా పండుగ సందర్భంగా కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులు అలుగుబెల్లి నర్సిరెడ్డి, వరలక్ష్మితో పాటు సతీమణి వినూష, మా మామగారు, అత్తగారు, బంధువులు, స్నేహితుల తో ఈ సంకాంత్రి ఎంతో ఆనందానిచ్చింది. ఈ మదుర క్షణాలను మర్చిపోలేని విధంగా సంక్రాంతిని జరుపుకున్నాను.

- అలుగుబెల్లి శ్రీచరణ్, నల్లగొండ, ప్రవాస భారతీయుడు



నల్లగొండలో ఎన్ఆర్ఐల సంక్రాంతి వేడుకలు

నల్లగొండ జిల్లాకేంద్రంలో ఎన్ఆర్ఐలు పాదూరితో పాటు గంట్ల కుటుంబసభ్యులు సోమవారం సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు వేడుకల్లో పాల్గొనేందుకు వారు ఇటీవల అమెరికా, లండన్ నుంచి నల్లగొండకు వచ్చారు. రిటైర్డ్ వార్డెన్ పాదూరి ఇంద్రాసేనారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు పాదూరి వినోద దంపతుల కుమారుడు పాదూరి సుశ్విత్‌కుమార్ రెడ్డి, ఆయన సతీమణి నిహారిక అమెరికాలోని టెక్సాస్‌లో స్థిరపడ్డారు. ఈ సంక్రాంతికి వారి మనవడు రణవ్ కృష్ణ కూడా నల్లగొండకు వచ్చి తన తాత, నానమ్మతో సరదాగా పండుగ జరుపుకున్నాడు. ఇంద్రాసేనారెడ్డి, వినోదల కూతురు సస్యారెడ్డి, ఆమె భర్త గంట్ల రాంభూపాల్ లండన్‌లో స్థిరపడ్డారు. తమ పిల్లలు అనిషిక, అన్విత్‌తో కలిసి సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలు మాట్లాడుతూ తాము ఉద్యోగ రీత్యా విదేశాల్లో ఉన్నప్పటికీ సంక్రాంతి పండుగను కుటుంబసభ్యుల మధ్య జరుపుకోవడానికి రావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

ఫుట్‌బాల్‌లో దిట్ట ఒసామా

● దేశవిదేశాల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడిస్తున్న విద్యార్థి



నేపాల్‌లో ఫుట్‌బాల్‌లో బహుమతి అందుకుంటున్న మహ్మద్ ఒసామా

నల్లగొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల ఆసక్తి పెంచుకున్న ఒసామా ఖాదర్ 14ఏళ్ల వయస్సులోనే రాణిస్తూ దేశ విదేశాల్లో భారతదేశ మువ్వెన్నల త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నాడు. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన మహ్మద్ ఖాదర్, అంజుం దంపతుల కుమారుడు ఒసామా ఖాదర్ రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల్లో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. 2024 సంవత్సరంలో ఉత్తరఖాండ్‌లో జరిగిన అండర్-14 ఫుట్‌బాల్ మ్యాచ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన ఒసామా, 2025 సంవత్సరంలో ఇదే నెల మొదటి వారంలో నేపాల్ దేశంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అండర్ -14లో మరోసారి గోల్డ్‌మెడల్ సాధించారు.

కోచ్ తర్ఫీదుతో రాణిస్తూ..

ఎస్‌డీపీఎఫ్(స్పోర్ట్స్ డవలప్‌మెంట్ అండ్ ప్రమోషన్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో కోచ్ అద్నాన్ ఆహ్మద్ ఇస్తున్న తర్ఫీదుతో ఒసామా ఫుట్‌బాల్ రాణిస్తున్నాడు.. హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో ఉన్న సెయింట్ జార్జ్‌లోని మైనార్టీ కోటాలో 8వ తరగతి చదువుతున్నాడు. ఐదు సంవత్సరాలుగా కోచ్ ఆధ్వర్యంలో ఫుట్ బాల్‌లో శిక్షణ పొందుతున్నాడు. తండ్రి మహ్మద్ వ్యాపారం చేస్తుండగా తల్లి అంజుం మాస్ కమ్యూనికేషన్‌లో జర్నలిజం పూర్తిచేసి గృహిణిగా ఉన్నారు. ఫుట్‌బాల్‌లో ఒసామా ప్రతిభ కనబర్చడంపై వెల్మకన్నె గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకొస్తా



ఫుట్‌బాల్‌లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకొస్తా. ప్రోత్సహిస్తున్న కోచ్ అద్నాన్ ఆహ్మద్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు. రాష్ట్రం, దేశంతో పాటు విదేశాల్లో జరుగుతున్న పోటీలల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించడం ఎంతగానో సంతోషం ఉంది.

● మహ్మద్ ఒసామా, ఫుట్‌బాల్ క్రీడాకారుడు

సకల జనులకు పండుగే



(5వ పేజీ తరువాయి)

సేద్యానికి యోగ్యమైన ప్రతి ఎకరాకూ రూ.12వేలు అందజేయనుండగా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. ఈ నెల 12న రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు అధికారులు అందరితో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 26న పథకాలు అన్ని అమలులోకి రానున్నాయి.

మూడు జిల్లాలో 42వేల ఇందిరమ్మ ఇళ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో మొదటి విడతలో 42వేల ఇల్లను మంజూరు చేయనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొత్తం 12 నియోజకవర్గాలకు 42వేల ఇళ్లు మంజూరు చేయనున్నారు. దీంతో నిరుపేదలకు సొంతింటి కల నెరవేరనుంది. లబ్ధిదారులు 400చదరపు అడుగుల స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం సహాయం అందించనుంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను వేసి దరఖాస్తులను పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామపంచాయతీలకు నల్లగొండ జిల్లాలో 844, సూర్యాపేట జిల్లాలో 475 గ్రామాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 421 చొప్పున ఉన్నాయి. 19 మునిసిపాలిటీలు ఉన్నాయి. ఇప్పటికే దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి ఆన్‌లైన్‌లో కూడా పొందుపర్చారు. మొదటి దశలో వీరందరికీ ఇళ్లు మంజూరు కానుండటంతో నిర్మాణాలు కూడా మొదలు కానున్నాయి. ఈ నేపథ్యంలో అధికార యంతాంగ్రం అన్నిఏర్పాట్లను పూర్తిచేస్తుంది.

భూమి లేని కూలీలకు ఆత్మీయ భరోసా

భూమి లేని కూలీలందరికీ ప్రతి ఏటా రూ.12వేలు వారి ఖాతాలో జమ చేయడం కోసం ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఉపాధి హామీ జాబ్ కార్డులను పరిగణనలోకి తీసుకొని భూమి లేని వారిని గుర్తించి వారికి ఆత్మీయ భరోసా అందజేస్తారు. అయితే కౌలు రైతులకు కూడా, భూమిలేని కూలీలతో కలిపి ఆత్మీయ భరోసా ఇస్తారనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ నెల 16 నుంచి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కార్యాచరణ చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 3.5 లక్షలుగా పైగా కౌలు రైతులుండగా కూలీలు ఎంతమంది అనేది లెక్కతేలుస్తున్నారు. ఈ 12వేలను రెండు విడతలుగా వారి ఖాతాలో వేయనున్నారు. ఇందుకోసం అధికార యంతాంగ్రం అంతా లెక్కగట్టే పనిలో ఉంది. మొత్తానికి భూమిలేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సాయం అందనుండటంతో వారు అంతా ఆతృతతో ఉన్నారు.

మరో 50 వేలకు పైగా కొత్త రేషన్‌కార్డులు

కొత్త రేషన్‌కార్డులకు మోక్షం రానుంది. గత ప్రభుత్వం హయాంలో కొత్త రేషన్ కార్డులను ఇవ్వకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు వారికి అందని పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.10.07 లక్షలకు ఆహారభద్రత కార్డులు ఉండగా యూనిట్ల విషయానికి వస్తే 29,82,694 ఉన్నాయి. ఇందుకుగాను మూడు జిల్లాలో ప్రతినెలా 19వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. మరో 50వేలకు కార్డులు కొత్తగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే దరఖాస్తులన్నింటినీ పరిశీలన పూర్తి చేశారు. ప్రతి సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో ప్రతి ఒక్క నిరుపేద రేషన్‌కార్డు కోసం ఎదురుచూపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సైతం జనవరి 26న అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు ఇవ్వడం కోసం కార్యాచరణను సిద్ధం చేసింది.

'రైతు భరోసా' కింద రూ.12వేలు

సాగులో ఉన్న భూమికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా రూ.12వేలను పెట్టుబడి సాయం కింద అందజేయనుంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.7500ల చొప్పున మొత్తం రూ.15వేలను జమ చేస్తామని చెప్పారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రూ.15వేలు కాకుండా రూ.12వేలు వేయనున్నారు. నల్లగొండ, యాదాద్రిభువనగిరి, సూర్యాపేట జిల్లాలో 21.50లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. రాళ్లు, రప్పలు, గుట్టలు ఉన్న భూములకు రైతుభరోసాను నిలిపివేశారు. కేవలం సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లించనున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఎకరాకు రూ.5వేలు ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.6వేలు అంటే రెండు సీజన్‌లో కలిపి రూ.12వేలను పెట్టుబడి సాయంగా ఇవ్వనున్నారు.

16 నుంచి క్షేత్రస్థాయిలో సాగు భూముల పరిశీలన



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సాగుకు యోగ్యమైన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. గ్రామసభల ఆమోదం కోసం 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తాం. 24వ తేదీన సా యంత్రం రైతుభరోసాకు సంబంధించి రైతులు సాగుచేసే వివరాలన్నింటినీ నమోదుచేయడం చేస్తాం. 26వ తేదీన రైతుభరోసా నిధులు అర్హులైన ప్రతి ఒక్క రైతు ఖాతాలో జమవుతాయి.

పీ. శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

వాహనాలు తగ్గుముఖం.. రహదారి ప్రశాంతం

● హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ తగ్గుముఖం ● పోలీసుల ముందస్తు చర్యలతో సాఫీగా ప్రయాణం



ప్రశాంతంగా ఉన్న సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని జాతీయ రహదారి

చౌటుప్పల్ టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై నాలుగు రోజులుగా కొనసాగిన వాహనాల రద్దీ సోమవారం తగ్గుముఖం పట్టింది. సంక్రాంతి పండుగకు ప్రజలు పట్టణాల నుంచి పల్లెలకు బస్సులు, కార్లు, బైకులపై వేలాదిగా బయలుదేరిన విషయం తెలిసిందే. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నెంబరు జాతీయ రహదారి తక్కువ సంఖ్యలో వెళ్లాయి. భోగి పండుగ ప్రారంభం కావడంతో ఆంధ్రా ప్రాంతానికి వెళ్లే వాహనాల సంఖ్య తగ్గినట్లేనని పోలీసులు భావిస్తున్నారు. మూడు రోజుల నుంచి సాగిన వాహనాల రద్దీ తో పోల్చుకుంటే సోమవారం నాలుగవ రోజు వాహనాలు సంఖ్య పలుచగా కనిపించింది. పట్టణంలోని జంక్షన్ల వద్ద తప్ప ఇతర ప్రాంతాల్లో వాహనాలు మామూలుగా ముందుకు వెళ్లిపోయాయి. మూడు రోజుల పాటు హైవే పై ఐదు వరుసల్లో వెళ్లిన వాహనాల బారులు మూడు వరుసలకు తగ్గిపోయాయి. స్థానిక వాహనదారులు, పాదాచారుల కోసం క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు హైవే వాహనాలను నిలిపినప్పుడు మాత్రమే విజయవాడ వైపు వెళ్లే వాహనాలు కొద్ది దూరం వరకు నిలిచిపోయాయి. మామూలు రోజుల్లో కూడా హైవే జంక్షన్ల వద్ద వాహనాలు ఇదే మాదిరిగా నిలిచి పోతుంటాయి. ఆర్టీసీ బస్సుల్లో సైతం ప్రయాణికుల రద్దీ కాస్త తగ్గింది. జాతీయ రహదారిపై ఆంధ్రకు వెళ్తున్న వాహనాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందుకు వెళ్లేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎలా ఇబ్బందులు లేకుండా వాహనాలు వెళ్లిపోయాయి. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఈనెల 15వ తేదీ నుంచి ఆంధ్రా నుంచి తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

టోల్‌గేట్ల వద్ద తగ్గిన రద్దీ..

చౌటుప్పల్ రూరల్, (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో మూడు రోజులుగా వాహనాలతో రద్దీగా ఉన్న హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం వాహనాల తాకిడి తగ్గింది. పండుగకు స్వగ్రామలకు మూడు రోజుల నుంచి వెళ్తుండడంతో జాతీయ రహదారిపై వాహనాల సందడి తగ్గింది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ లేకపోవడంతో 16 గేట్ల కుగాను ఎనిమిది గేట్ల ద్వారా మాత్రమే విజయవాడ వైపు వాహనాలను పంపించారు. సాధారణ రోజుల కంటే వాహనాల రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి.

జాతీయ రహదారిపై తగ్గిన వాహనాల రద్దీ

కోదాడ రూరల్, (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులుగా విపరీతమైన రద్దీ ఉన్న జాతీయ రహదారి సోమవారం పూర్తిగా తగ్గిపోయింది. సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూర్లకు వెళ్లేందుకు ప్రయాణికులు పెద్దఎత్తున తరలివెళ్తుండడంతో జాతీయ రహదారిపై మూడు రోజులుగా విపరీతమైన వాహనాల రద్దీ ఏర్పడింది. మూడురోజుల్లో స్వల్ప ప్రమాద ఘటనలు మినహా వాహనాలకు ఎటువంటి అంతరాయం లేకుండా తరలివెళ్లాయి. ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం హైద్రాబాద్ నుంచి రామాపురం క్రాస్‌రోడ్డు వరకు పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. వాహనాలకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రమాదాలు జరిగినా వెంటనే క్షతగాత్రులను తరలించేందుకు అంబులెన్సులను, ప్రతి సర్కిల్ పరిధిలో క్రేన్లు అందుబాటులో ఉంచారు. ఐజీ స్థాయి అధికారి ఈ సారి వాహనాల రాకపోకల పర్యవేక్షణ బాధ్యత చేపట్టారు. హైదరాబాద్ నుంచి రామాపురం క్రాస్‌రోడ్డు వరకు మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ రెండు డ్రోన్ కెమెరాల ద్వారా ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. వాహనాలకు అంతరాయం కలగకుండా ప్రయాణించేందుకు ఈసారి 30 మందికిపైగా ఎస్ఐలు, 15 మంది సీఐలు, ఇద్దరు డిఎస్పీలు, 500 మంది కానిస్టేబుళ్లు పనిచేశారు.



బోసిపోయిన రహదారి

కేతేపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో గత మూడు రోజుల పాటు రద్దీగా ఉన్న జాతీయ రహదారి సోమవారం ప్రశాంతతను సంతరించుకుంది. పండగ నేపథ్యంలో గత శుక్రవారం రాత్రి, శని, ఆదివారాల్లో హైదరాబాద్ నుంచి కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు వెళ్ళే కార్లతో పాటు సాధారణ వాహనాలతో 65వ నెంబరు జాతీయ రహదారి క్రిక్కిరిసిపోయింది. దాదాపు మూడు రోజుల పాటు విరామం లేకుండా వెళ్లిన వాహనాలతో రద్దీగా ఉన్న జాతీయ రహదారి సోమవారం ఒక్కసారిగా నిర్మానుష్యంగా మారిం ది. సోమవారం జాతీయ రహదారిపై ఇరువైపులా అడపాదడపా వచ్చిపోయే లారీలు, ఆర్టీసీ బస్సులు మినహా ఇతర వాహనాల రద్దీ లేకుండా పోయింది. దీంతో మూడు రోజుల పాటు రణగొణ ధ్వనులతో మార్మోగిన రోడ్డు సోమవారం ప్రశాంతంగా కనిపించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ లేకపోవడంతో 16 గేట్లకుగాను 8గేట్ల ద్వారా మాత్రమే విజయవాడ వైపు వాహనాలను పంపించారు. సాధారణ రోజుల్లో 35వేల వాహనాలు ఏపీ వైపు వెళ్లగా ఆదివారం అర్ధరాత్రి సోమవారం ఉదయం 6గంటల వరకు 5వేల వాహనాలు వెళ్లాయి. సోమవారం రాత్రి మొత్తం 20వేల వాహనాలు వెళ్లాయి.



ప్రశాంతంగా జాతీయ రహదారి

రహదారులు నిత్యం నెత్తురోడుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. అనేకమంది క్షతగాత్రులవుతున్నారు. వాహనాల్లో వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి వస్తారనే నమ్మకం లేకుండా పోతోంది. అతి వేగం, రాంగ్ రూట్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణాలుగా అధికారులు భావించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రవాణా శాఖ, పోలీస్‌శాఖ, ఆర్టీసీ సంస్థల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. వాహనాలు నడిపే డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ రహదారిపై వాహనాలు నిర్దేశించిన వేగం కంటే ఎక్కువ వేగంతో వెళ్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో వాహనాల వేగాన్ని అదుపు చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

● (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట క్రైం, డిండి)



వేగం తీసిన.. ప్రాణాలెన్నో!



కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ రాంబాబు, డీటీవో సురేష్‌రెడ్డి(ఫైల్)

సూర్యాపేట జిల్లాలో 2023లో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మొత్తం 573రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అందులో 257మంది మృత్యువాత పడ్డారు. 512మంది క్షతగాత్రులయ్యారు. గత ఏడాది జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగింది. ఈ ఏడాది జిల్లాలో 609 రోడ్డు ప్రమాదాలు జరిగి, 262 మంది మృతి చెందగా, 544మంది గాయపడ్డారు. బైక్‌లు, ఆటోలు, కార్లకు సంబంధించి ఎక్కువ ప్రమాదాలు జరిగాయి. బైక్ ప్రమాదాల్లోనే ఎక్కువగా 151మంది మృతిచెందారు. వీరితో పాటు నడుచుకుంటూ వెళ్తున్న వారిని వాహనాలు ఢీకొన్ని సంఘటనల్లో 37మంది మృతిచెందారు.

బ్లాక్‌స్పాట్ల వద్ద కొనసాగుతున్న పనులు

సూర్యాపేట జిల్లాలోని 65వ నంబరు హైవేపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను అధికారులు బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. మొత్తం 17 ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్లు ఉన్నట్లు గుర్తించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్‌రోడ్డు, వ్యవసాయ మార్కెట్, దురాజ్‌పల్లి క్రాస్‌రోడ్డు, కట్టకొమ్మగూడెం క్రాస్‌రోడ్డు, ముకుందాపురం క్రాస్‌రోడ్డు, మొద్దులచెర్వు క్రాస్‌రోడ్డుతో పాటు మిగిలిన ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు జాతీయ రహదారుల సంస్థ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మొదట సూర్యాపేటలోని జనగాం క్రాస్ రోడ్డు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఇది పూర్తికాగానే వ్యవసాయ మార్కెట్ క్రాస్ రోడ్డు తర్వాత మిగిలిన ప్రాంతాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు, జంక్షన్లను అభివృద్ధి చేయనున్నారు.

సూర్యాపేట జిల్లాలో డేంజర్ స్పాట్లు ఇక్కడే..

సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల, రాయినిగూడెం, పిల్లలమర్రి స్టేజీ, సూర్యాపేట జిల్లాకేంద్రంలోని జనగాం క్రాస్‌రోడ్డు, అంజనాపురి కాలనీ, వ్యవసాయ మార్కెట్ క్రాస్ రోడ్డు, రాజీవ్‌పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన రోడ్డు క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి, వల్లభాపురం, గుంపుల, మునగాల మండల పరిధిలోని మొద్దుల చెరువు స్టేజీ, మునగాల మండలకేంద్రం శివారు, బరాఖత్‌గూడెం, కోదాడ మండలంలోని కొమరబండ, కట్టకొమ్మగూడెం క్రాస్‌రోడ్డు, చిమిర్యాల క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. హుజూర్‌నగర్, అర్వపల్లి, నాగారం, గరిడేపల్లి, నేరేడుచర్ల, తిరుమలగిరి, మోతె మండలాలు, సూర్యాపేట-ఖమ్మం, కోదాడ- మిర్యాలగూడెం, సూర్యాపేట-జనగాం, సూర్యాపేట-దంతాలపల్లి రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నాయి.



అతి వేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్‌తో..

రోడ్డు ప్రమాదాలకు ముఖ్యంగా వాహనాల అతి వేగం ప్రధాన కారణం. వాహనాలు నడిపే వారు రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం మత్తులో నడుపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీస్ అధికారులు భావిస్తున్నారు. వీటితో పాటు లైసెన్సులు లేనివారు వాహనాలు నడుపుతున్నారు. జాతీయ రహదారిపై గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు నిర్మించలేదు. దీంతో వాహనదారులు కొంత దూరం సర్వీస్ రోడ్డు వరకు వెళ్లి తిరిగి గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో దూరం ప్రయాణించ లేక రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. దీంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపైకి గేదెలు వస్తున్నాయి. డివైడర్‌పై ఉన్న గడ్డి మేస్తూ ఒక్కసారిగా రోడ్డు పైకి వస్తుడడంతో వాహనాలు వాటిని ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కోదాడ నియోజక వర్గ పరిధిలో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. గతేడాది ఏడాది సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి కాలనీ క్రాస్‌రోడ్డు వద్ద లారీని ఆటో ఢీకొట్టడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాం



జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషిచేస్తున్నాం. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాం. వాహనదారులు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలి. డ్రైవర్ల అజాగ్రత్తతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం మత్తులో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిపై చర్యలు చేపడుతున్నాం. ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లలో రక్షణ చర్యలు చేపట్టాం. జనవరిలో నెల మొత్తం రోడ్డు భద్రతపై విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- తేజస్ నందలాల్ పవార్, సూర్యాపేట జిల్లా కలెక్టర్

- అతి వేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు
- అవగాహన కల్పిస్తున్నా ఆగని ప్రమాదాలు
- నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదం
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కొరడా



సూర్యాపేట జిల్లాలో 2023లో ఈ చలాన్ల సంబంధించి మొత్తం 2,60,044 నమోదయ్యాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.7.79 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది 2,36,289 చలాన్లు వేయగా, వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.7.53కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లాలో గత ఏడాదిలో ఈ చలాన్ నమోదు చేసే యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొన్ని నెలలు చలాన్లు వేయడం బంద్ చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. 2023లో 22,875కేసులు నమోదు చేశారు. జరిమానా రూపంలో ప్రభుత్వానికి రూ.1.66కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాదికి మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై 12,940 కేసులు నమోదు చేశారు.

ఇంటికి పెద్దదిక్కును కోల్పోయాం



నా కుమారుడు శేఖర్ బైక్‌పై రోడ్డు దాటుతుండగా డిండిలో మరో బైక్ వచ్చి ఢీకొనడంతో కోమాలోకి పోయాడు. నెల రోజుల పాటు ఆస్పత్రిలో ఉంచి చికిత్స చేయించినా బతక లేదు. వైద్యం కోసం అప్పుచేసి రూ.13లక్షలు ఖర్చు చేశాం. పది సంవత్సరాల క్రితం నా భర్త సైదులు వ్యవసాయ బావి వద్ద విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఇంటికి పెద్ద దిక్కులేకుండా పోవడంతో దిక్కులేని దానిని అయ్యాను. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.60 వేలు మాత్రమే వచ్చాయి. నా కొడుకు ఉద్యోగం నా ఒక్కగానొక్క కుమార్తెకు ఇప్పించాలి. కూలి పని చేస్తూ జీవనం వెళ్లదీస్తున్నాం.

- పోలం నారమ్మ, డిండి

రోడ్డు స్టాపర్‌లు ఏర్పాటు చేయాలి



డిండి మండలకేంద్రంలోని జాతీయ రహదారి 765పై యూటర్న్‌ల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగంగా వచ్చిన వాహనాలు ఢీకొని చనిపోతున్నారు. వాహ నాలు మితిమీరిన వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. డిండి మండల కేంద్రంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రోడ్డు స్టాపర్లను ఏర్పాటు చేయాలి. అతివేగంగా వాహనాలు నడిపే వారిపై చర్య తీసుకోవాలి.

- బూషిపాక వెంకటయ్య. మాజీ ఎంపీటీసీ

ఎన్నో కుటుంబాల వేదన

● నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని యూ నియన్ బ్యాంక్ వద్ద ఉన్న యూటర్న్ వద్ద ద్విచక్ర వాహనాన్ని మరో వాహనం ఢీకొని వీఆర్‌ఏ పోలం శేఖర్(25) తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లాడు. నెల రోజులపాటు చికిత్స పొంది మృతిచెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న శేఖర్ మృతిచెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. ● డిండి ప్రాజెక్టు దిగువన ఉన్న మత్స్య బీజోత్పత్తి క్షేత్రం వద్ద నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం వెల్లటూరుకు చెందిన లక్ష్మణ్‌ను కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. రెండు ఎకరాల వ్యవసాయ భూమిని అమ్మి వైద్య చికిత్సల కోసం ఖర్చు చేశాడు.● డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న నగరదుబ్బతండాకు చెందిన యువకుడు పాత్లావత్ రాజు ట్రాక్టర్ ఢీకొని మృతి చెందాడు. ●డీఎన్‌టీ కాలనికి సమీపంలోని యూటర్న్ వద్ద కారు ఢీకొని డిండి మండల కేంద్రానికి చెందిన కార్పెంటర్ ఉప్పునూతల బుచ్చాచారి, ఇదే యూటర్న్ వద్ద నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం ఉమ్మాపూర్‌కు చెందిన బాలలింగం మృతిచెందారు.

రోడ్డు పక్కన స్టాపర్లు

నల్లగొండ జిల్లా శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు అడ్డూ అదుపులేకుండా వెళ్తున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకులు మృత్యువాత పడుతున్నారు. హైవేపై వేగనియంత్రణ(రోడ్డు స్టాపర్లు) లేకపోవడంతో యూటర్న్‌ల వద్ద అతివేగంగా వస్తున్న వాహనాలను ఢీకొని పాదచారులు, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు మృత్యువాతపడుతున్నారు. తరచూ ఏదో ఒక యూటర్న్ వద్ద జరుగుతున్నాయి. రోడ్డు ఉండాల్సిన స్టాపర్లు రోడ్డు పక్క ముళ్ల పొదలు, పిచ్చి మొక్కల మధ్య ఉంటున్నాయి. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు రోడ్డు స్టాపర్‌లు ఏర్పాటు చేయడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.



రోడ్డుపక్కన పిచ్చిమొక్కల్లో ఉన్న రోడ్డు స్టాపర్లు

టైరు పేలి ఆటో ట్రాలీ బోల్తా

● 15 మందికి గాయాలు ● ఐనవోలు జాతరకు వెళ్లి వస్తుండగా ఘటన



భువనగిరి బైపాస్ రోడ్డుపై పల్టీ కొట్టిన ఆటో ట్రాలీ

భువనగిరి టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతరలో పాల్గొని తిరుగు ప్రయాణంలో ఆటో ట్రాలీ టైరు పేలి అదుపు తప్పి పల్టీ కొట్టడంతో 15మంది భక్తులు గాయపడ్డారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి బైపాస్ రోడ్డుపై ఈ సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండలం ఏదులాబాద్‌కు చెందిన 15మంది సమీప బంధువులు ఒకే ఆటో ట్రాలీలో వరంగల్ జిల్లాలో సాగుతున్న ఐనవోలు మల్లన్న జాతరకు శనివారం వెళ్లారు. దైవ దర్శనం తదితర కార్యక్రమాలు ముగించుకుని ఆదివారం వెళుతుండగా భువనగిరి బైపాస్ రోడ్డుపై వారు ప్రయాణిస్తున్న ఆటో ట్రాలీ టైరు పేలి అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్ సహా అందరూ బైపాస్ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. మల్లేశ్, లక్ష్మి, బాలమ్మ, శ్రీను, రాజు, సంతోష్‌కు తీవ్ర గాయాలు కాగా మిగతా 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అందరినీ 108 అంబులెన్స్‌లో భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన వారందరినీ ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకువెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో క్షతగాత్రులు బైపాస్ రోడ్డుపై పడినప్పుడు ఆ మార్గంలో భారీ వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

వివాహిత అనుమానాస్పద మృతి

గరిడేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో సోమవారం వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండల కేంద్రానికి చెంది నందిపాటి శోభ(32)కు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన నందిపాటి రాజుతో 2011లో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు, 2015లో భార్యాభర్తల మనస్పర్థల కారణంగా శోభ నేరేడుచర్ల తన తల్లిగారి ఇంటి వద్ద ఉంటూ కూలీ పనులకు వెళ్తుండేది. ఈ క్రమంలో గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన మోదుగు మధుతో పరిచయం కాగా వారిద్దరూ మండలంలోని ఎల్బీనగర్ గ్రామంలో రెండు నెలలుగా రూమ్ కిరాయికి తీసుకొని నివాసం ఉంటున్నారు. అయితే 12న రాత్రి శోభ అనారోగ్యంతో మృతి చెందింది. శోభ అనుమానాస్పదంగా మృతి చెందిందని ఆమె తండ్రి పిడమర్తి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.నరేష్ తెలిపారు.

కోడి పందేలకు పల్లెలు సిద్ధం..!

కోదాడ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు వేసేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం వేల రూపాయలను పందెంలో కాసేందుకు పందెం రాయుళ్లు సిద్ధమవుతున్నారు. సంక్రాంతి సందర్భంగా ఆంధ్రాలో పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రాకు సరిహద్దుగా ఉన్న కోదాడ నియోజకవర్గంతో పాటు చింతలపాలెం, మేళ్లచెర్వు, అనంతగిరి మండలాల నుంచి పెద్దఎత్తున పందెంరాయుళ్ల కోళ్లను కొనుగోలు చేసి పందాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వీరు గత వారంరోజుల కిందటే ఆంధ్రాలో ఒక్కో పందెం కోడిని రూ. 10 నుంచి 30 వేల వరకు పెట్టి కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు తెలిసింది. కూచిపూడి, రెడ్లకుంట గ్రామాలకు చెందిన వారు కృష్ణానది పక్కన ఉన్న మాచవరం మండలంలోని పలు గ్రామాల నుంచి కోళ్లను తీసుకొచ్చినట్లు తెలిసింది. కోడి పందేలు వేసేందుకు మండలంలోని రెడ్లకుంట, చిమిర్యాల, నల్లబండగూడెం, రామాపురం గ్రామాలతో పాటు కాపుగళ్లు, తొగర్రాయి, గణపవరం గ్రామాల్లో కోడిపందేలకు నిర్వాహకులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.0

బాల్యం, విద్యాభ్యాసం సాగర్‌లోనే

● మందా జగన్నాథంతో జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న మిత్రులు

నాగార్జునసాగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మందా జగన్నాథం బాల్యం అంతా సాగర్‌లోనే గడిపారు. సాగర్ హిల్‌కాలనీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి వరకు ఆయన చదువుకున్నారు. మందా జన్నాథం స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా ఇటిక్యాల మండలం కొండేరు గ్రామం. కాగా సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆయన తల్లిదండ్రులు సాగర్‌కు వచ్చారు. ఆయన తండ్రి పెద్దపుల్లయ్య సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో మెకానికల్ విభాగంలో వాచ్‌మన్‌గా పనిచేయగా, తల్లి సవరమ్మ హిల్‌కాలనీలో హెల్త్ ఆఫీస్‌లో ఆయగా పనిచేశారు. సాగర్‌లో ఆయన కుటుంబ సభ్యులు పైలాన్ కాలనీలో కొంత కాలం, హిల్‌కాలనీలో ఈ-1 టైపు క్వార్టర్‌లో కొంత కాలం నివసించారు. ఆయన తల్లిదండ్రులు ఉద్యోగ విరమణ తర్వాత సాగర్ నుంచి వెళ్లి పోయారు. 2023 ఆగస్టు 11న ఆయన స్నేహితుడు ఆవుల యాదగిరి దశదిన కర్మలో పాల్గొన్నారు. సాగర్‌కు వచ్చిన ప్రతి సారీ ఆయన తన స్నేహితులతో ఆనందంగా గడిపేవారని మరో స్నేహితుడు రాందాసు తెలిపారు. అంతే కాకుండా నందికొండ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మందా రఘువీర్‌కు మాజీ ఎంపీ జగన్నాథం దగ్గరి బంధువు కావడంతో చాలా సార్లు సాగర్‌కు వచ్చారు. జగన్నాథం మృతి చెందడంతో ఆయన స్నేహితులు ఆయనతో గడిపిన జ్ఞాపకాలను కొందరు గుర్తు చేసుకోగా మరి కొందరు ఆయన అంత్యక్రియలకు వెళ్లారు.



సాగర్‌లో స్నేహితులతో మందా జగన్నాథం (ఫైల్)

సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలి : స్పీకర్ గడ్డం ప్రసాద్

భువనగిరి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ ఫలాలు ప్రజానీకానికి అందాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆకాంక్షించారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని ఆయన దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలకగా స్వయంభువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భాలయం అభిముఖంగా ఉన్న ధ్వజస్తంభానికి మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేసిన అనంతరం ఆలయ వెలుపల మీడియాతో మాట్లాడారు. ప్రజలు, రైతులు సమస్త ప్రజానీకం సుఖ సంతోషాలతో ఉండాలని స్వామిని మొక్కుకున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు వాగ్దానం నెరవేరాలని, పథకాలు ప్రతీ గడపకు చేరాలన్నారు. మరింత మనోధైర్యం ఇచ్చేలా దీవించాలని స్వామివారిని వేడుకున్నారు. యాదగిరి క్షేత్ర సందర్శన తనకు ఎంతో తృప్తిని ఇచ్చిందన్నారు. శ్రీరంగనాథుడు-గోదాదేవిల కల్యాణంలో పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం కలగడం అదృష్టమన్నారు. అనంతరం ఆలయ దివ్య విమాన రాజగోపురం బంగారు తాపడం పనులను సందర్శించి తిరువీధి సేవలో పాల్గొన్నారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు, అర్చకులు

శివకేశవులకు విశేష పూజలు

యాదగిరిగుట్టంపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 43,46,558 ఆదాయం రాగా ఇందులో రూ.12లక్షలు లీజెస్ ద్వారా సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు ఏర్పాట్లు పరిశీలన

పాలకవీడు, జనవరి13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు ఏర్పాట్లను హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు సోమవారం పరిశీలించారు. దర్గా పరిసర ప్రాంతాల్లో తిరిగి భారీకేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సఫాయి బావి చుట్టూ పోలీసుల నిఘా ఎక్కువగా ఉండాలని ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వాహనాలు లోనికి అనుమతించకుండా పార్కింగ్ స్థలాల్లో ఉంచే విధంగా పోలీసులను ఉంచనున్నట్లు తెలిపారు. ఈ నెల 23, 24, 25వ తేదీల్లో నిర్వహించనున్న ఉర్సుకు అన్ని శాఖల సిబ్బంది ఇక్కడే ఉండి భక్తులకు సేవలందించేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ లక్ష్మీనర్సయ్య, మోతీలాల్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

హుజూర్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పరిధిలోని మాధవరాయనిగూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం రసవత్తరంగా కొనసాగాయి. ఆది, సోమ, మంగళవారం నిర్వహించనున్న ఈ పోటీల్లో సుమారు 32 టీమ్‌లు, 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండో రోజు సోమవారం కబడ్డీ పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ఆదరించాలన్నారు. తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఏర్పాటుచేసిన ఈ పోటీలకు క్రీడాకారుల నుండి మంచి ఆదరణ లభించిందన్నారు. పార్టీలకు అతీతంగా ఈ పోటీలను పెద్దఎత్తున నిర్వహించారు. మంగళవారం కూడా పెద్ద ఎత్తున పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు.

ఇద్దరు భార్యల చేతిలో భర్త హతం

● రోకలి బండతో మోది హత్య ● కుమార్తెను వేధిస్తున్నాడనే అనుమానం



ఇద్దరు భార్యలతో సైదులునాయక్ (ఫైల్)

చివ్వెంల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు భార్యల చేతిలో భర్త హతమయ్యాడు. ఆదివారం అర్ధరాత్రి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుర్రంతండాలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ వల్లపు మహేశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుర్రంతండాకు చెందిన రత్నావత్ సైదులునాయక్(40) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ, కూలి పనులకు వెళ్తుండేవాడు. ఇస్తాళాపురం గ్రామానికి చెందిన రమ్యతో 20ఏళ్ల క్రితం సైదులునాయక్‌కు వివాహమైంది. మొదటి భార్యకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టడంతో రమ్య సోదరి సుమలతను 15ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు పదేళ్ల కుమారుడు ఉన్నాడు. అప్పటినుంచి ఇద్దరు భార్యలు, సైదులనాయక్ ఒకే ఇంట్లో కలిసి జీవనం సాగిస్తున్నారు. మొదటి భార్య కుమార్తెను వేధిస్తున్నాడనే అనుమానంతో ఆదివారం రాత్రి సైదులు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రమ్య, సుమలత కలిసి ముందస్తు ప్రణాళికతో రోకలిబండతో తల, మెడపై మోది హత్య చేశారు. హత్య చేసిన సమయంలో ఇంట్లో పిల్లలు గాఢ నిద్రలో ఉన్నారు. అనంతరం ఇద్దరు భార్యలు అక్కడినుంచి పారిపోయారు. అంతకు ముందే అర్ధరాత్రి సైదులునాయక్ ఇంట్లో గొడవ జరగడంతో అనుమానం వచ్చిన స్థానికులు తెల్లవారుజామున ఇంటి వద్దకు చూసేసరికి సైదులునాయక్ విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సైదులునాయక్ చిన్నమ్మ కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వల్లపు మహేశ్వర్ తెలిపారు.

వివాహేతర సంబంధాలకు అడ్డుగా ఉన్నాడనే హత్య : బంధువులు

భార్యల వివాహేతర సంబంధాలకు అడ్డొస్తున్నాడనే వారి ప్రియులతో కలిసి సైదులునాయక్‌ను హత్య చేశారని ఆయన బంధువులు ఆరోపించారు. గతంలో కూడా పలుమార్లు సైదులును హత్య చేసేందుకు పథకం పన్నారని ఆరోపించారు. సైదులుకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, పిల్లల చదువులకు నిత్యం కష్టం చేసేవాడని తెలిపారు. సైదులుపై నిందలు వేసి హత్య చేశారని తెలిపారు.

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

మహిళల సంక్షేమానికి లయన్స్ క్లబ్ కృషి



శాలిగౌరారంలో బహుమతులు అందజేస్తున్న కేవీ ప్రసాద్

శాలిగౌరారం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని నల్లగొండ, ఖమ్మం, ఉమ్మడి జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ -2 కేవీ ప్రసాద్ అన్నారు. శాలిగౌరారంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నకిరేకల్‌లో ఎస్ఎల్ఎన్ స్వామి షాపింగ్ మాల్ సహకారంతో మండల స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోడే సతీష్, ఎస్ఎల్ఎన్ స్వామి, షాపింగ్ మాల్ ఎండీ గట్టు శ్యామ్‌సుందర్, పాస్ట్ జోన్ చైర్మన్ యర్ర శంభులింగారెడ్డి, చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్, చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ, సభ్యులు వెంకటాచారి, వడ్లకొండ బిక్షం, వెంకన్న, శ్రీనివాస్, రామ్మూర్తి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే వీరేశం



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించి తమ ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పందెనపల్లి, మునుకుట్ల గ్రామాల్లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడాల్లో రాణించి గ్రామాలకు పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. మండలంలోని పందెనపల్లి గ్రామంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్ది సుక్కయ్య, సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, గద్దపాటి వెంకన్న, గద్దపాటి దానయ్య, గద్దపాటి రాములు, కుంభం విజయ్ కుమార్‌రెడ్డి, సాయి, మాద లింగస్వామి, గోదాల వెంకట్‌రెడ్డి, రెడ్డిపల్లి స్వామి, శివశంకర్, శ్రీను, శేఖర్, శంకర్ రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు. ప్రజలు దైవ చింతన కలిగి భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పందెనపల్లి గ్రామంలో యాదవులు ఆరాధ్యదైవమైన మల్లన్న దేవునికి చేపట్టిన బోనాల పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ముక్కిడి యాదయ్య, గజ్జి రవి, ముక్కిడి వెంకన్న, కావటి యాదగిరి, గజ్జి సాయి, గజ్జి మధు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులతో సృజనాత్మకత

చిట్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముగ్గుల పోటీలు మహిళల్లో సృజనాత్మకతను వెలికితీస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య అన్నారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం చిట్యాలలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, సీపీయం పట్టణ కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, జిట్ట స్వామి, పార్వతమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా శ్రీగోదాదేవి కల్యాణం

చిట్యాలరూరల్, శాలిగౌరారం, కట్టంగూరు, నకిరేకల్, కనగల్, నార్కట్‌పల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లోని దేవాలయాల్లో శ్రీగోదాదేవి శ్రీరంగనాథస్వాముల తిరుకల్యాణోత్సవం సోమవారం జిల్లాలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పురోహితుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల భక్తిశ్రద్ధల నడుమ అంగరంగవైభవంగా జరిగింది. దేవతామూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి కల్యాణ వేడుకలను నిర్వహించారు. పురోహితులు యజ్ఞోపవీతధారణ, జీలకర్ర బెల్లం కార్యక్రమంతో పాటు మాంగళ్యధారణను చేసి భక్తులకు కల్యాణ విశిష్టతను వివరించారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు విశేషంగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. కల్యాణోత్సవాన్ని తిలకించిన భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోగా పురోహితుల ఆశీర్వచనాలు అందజేశారు.

● చిట్యాల మండలం నేరడ గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో పురోహితుల గోదాదేవి కల్యాణాన్ని అర్చకులు సముద్రాల శ్రీరంగం పాండురగాచార్యులు, కారంపూడి ప్రశాంత్‌లు నిర్వహించారు. స్వామివార్లకు గ్రామస్థులు దుబ్బాక అనిల్‌రెడ్డి, పట్టువస్త్రాలు, మంగళసూత్రం, వెండి యజ్ఞోపవీతం సమర్పించారు.

● శాలిగౌరారంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శేషం రత్నమాచార్యులు, నర్సింహాచార్యులు, జగన్ మోహనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరులోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రామడుగు శ్రీనివాస్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిపల్లి మనోహర్, కోమటి భాస్కర్, రాపోలు వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, బండారు అ రుణ్, ఓరుగంటి రమేష్ పాల్గొన్నారు.

● నకిరేకల్‌లోని మండలంలోని పాలెం, చందుపట్ల, నకిరేకల్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్, చందుపట్ల ఆలయ చైర్మన్ మేడవరపు కిషన్‌రావు, కందిమళ్ల లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, మేడవరపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● కనగల్‌లోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి గోదాదేవిల తిరుకల్యాణోత్సవాన్ని ఘనం గా నిర్వహించారు. వంశపారంపర్య ఆలయ ధర్మకర్త అక్కినేపల్లి శ్రీనివాసరావ్ దంపతులు, మాజీ సర్పంచ్ నర్సింగ్ సునీతాకృష్ణయ్యగౌడ్ దంపతులు కల్యాణానికి హాజరయ్యారు. పట్టువస్త్రాలను తలంబ్రాలను అందజేశారు. కా ర్యక్రమంలో చిట్లలింగయ్య, నర్సింగ్ లక్ష్మయ్య గౌడ్, ఓరుగంటి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని పలు వైష్ణవాలయాల్లో గో దాదేవీ కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం, గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానం, అక్కెనపల్లిలోని సాలగ్రామ వేంకటేశ్వర స్వామి ఆలయం, మాండ్ర శివారులో గల అనంత స్వర్ణగిరి పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాల్లో భా గంగా గోదాదేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులకు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు, కృ ష్ణమాచార్యుల యాజ్ఞికంలో



చిట్యాల మండలం నేరడలో గోదాదేవిరంగనాథస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

కల్యాణ వేడుకలు శాస్త్రోక్తం గా నిర్వహించారు. ఈ వేడుకలో ఉత్సవ కమిటీ సభ్యులు ఉంద్ర భాగ్యమ్మాలింగారెడ్డి, దోసపాటి ప్రసాద్, ఐతరాజు రమేశ్, విష్ణుమూర్తి, వేణు, బిళ్లకంటి శ్రీకాంత్, బెల్లి దశరథ, బిక్షమయ్య, శ్రీనివాస్, పసునూరి శ్రీనివాస్, పబ్బతి శేఖర్, బిక్షపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శాపల్లి కమలాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ అనువంశిక అర్చకులు కారంపూడి నర్సింహాచార్యులు, రాకేశాచార్యులు పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణగావించారు. ఈ వేడుకలో వివిధ పార్టీల నాయకులు సిద్దగోని స్వామిగౌడ్, భాషపాక విజయ్, నిమ్మనగోటి లింగయ్య, వెంకన్న, సిలిగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, బింగి కొండయ్య, సత్తయ్య, అచ్చాలు, సట్టు సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి ఉపేందర్, నర్సయ్య, వెంకట్‌రెడ్డి, శబరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో ఘనంగా మాస కల్యాణం

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని సోమవారం మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ మహామంటపంలో నిర్వహించిన ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో భోగి వేడుకలు

● ఆకట్టుకున్న గంగిరెద్దుల విన్యాసాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి వేడుకలు జిల్లాలోని వివిధ గ్రామాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. సంక్రాంతి వేడుకల్లో భాగంగా మొదటి రోజున భోగిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువకులు తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేసి వాటిపై ఆవు పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను పెట్టి పసుపు, కుంకుమలు, నవధాన్యాలు, గరక పోచలు, రేగుపండ్లు, పూలతో అందంగా అలంకరించారు. యువకులు రంగు రంగుల పతంగులను ఎగుర వేస్తూ ఆనందోత్సాహలతో గడిపారు. గంగిరెద్దుల వారు గంగిరెద్దుల ఇంటింటికీ తిరుగుతూ చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గ్రామస్థులు గంగిరెద్దులకు పసుపు కుంకుమలు చల్లి మొక్కుకున్నారు. కళాకారులకు బియ్యంతో పాటు ధాన్యం వివిధ రకాల వస్తువులను అందజేశారు. చాలాకాలం తర్వాత సంక్రాంతి రోజున గ్రామంలో గంగిరెద్దులు కనిపించటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కొందరు చిన్నారులు ఇళ్ల ముందర వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. భోగి కావడంతో నల్లనువ్వులతో పులుగప్రసాదాన్ని తయారు చేసి దేవునికి నైవేద్యం సమర్పించారు.



నల్లగొండ : భోగి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు



నల్లగొండ పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో ముగ్గు వేస్తున్న చిన్నారి



నార్కట్‌పల్లిలో గంగిరెద్దుల విన్యాసం

చెంచులను ఆదుకోవాలి

శాలిగౌరారం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చెంచులను ఆదుకోవాలని నేపాల్ దేశ మంత్రి అనిత సాహూ ముద్వి అన్నారు. శాలిగౌరారం మండలం తిరుమల రాయినిగూడెంకు చెందిన ఆర్ఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర సంఘటన్ అధ్యక్షుడు చాడ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీశైలం పుణ్యక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి సంక్రాంతి పండుగకు నాగరికతకు దూరంగా ఉన్న చెంచులను గౌరవించడం అభినందనీయమన్నారు. పండుగను పురస్కరించుకొని చెంచులతో సహపంక్తి భోజనాలు చేశారు. విల్లంబులు(బాణాలు) పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం చెంచులకు చీరసారె, బెడ్ షీట్లు, రగ్గులు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వామి సిద్ధియోగితో పాటు ప్రముఖ స్వామిజీలు, వివిధ రాష్ట్రాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



చెంచులకు దుప్పట్లు అందజేస్తున్న రమేష్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

● మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో నెలకొన్న సమస్యలన్నింటినీ త్వరలోనే పూర్తి చేయనున్నట్లు మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీ ఫేస్-1 ముఖద్వారాన్ని సోమవారం ఆయన లాంచనంగా ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్ల క్రితం మునిసిపల్ కౌన్సిలర్ ఎన్నికల్లో శ్రీరామ్‌నగర్ కాలనీ ఫేస్-1 ముఖద్వారం ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీ మేరకు స్థానిక కౌన్సిలర్ గడిగ హిమబిందు శ్రీనివాస్ ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తన సొంతం డబ్బులతో ముఖద్వారం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా సీసీ రోడ్డుకు ఇరువైపులా పచ్చనిచెట్లతో అందంగా అలంకరించి పట్టణంలోని మిగతా వార్డులకు దీటుగా తీర్చిదిద్దడం సంతోషకరమన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారం వార్డులో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులను మరో ఆరు నెలల్లో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ గడిగ హిమబిందు శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు వడ్డబోయిన రామకృష్ణ, నాయకులు ఆందోజు కృష్ణమాచారి, చింతపల్లి సుందర్, నాతి వెంకన్న, చిత్తలూరి శివ, బొబ్బిలి ఆంజనేయులు, వంగూరి జోసప్, కృష్ణ, రాజు, ధనుష్, సందీప్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

వైభవంగా గోదా రంగనాధుల కల్యాణం

● *దేవరకొండలో హాజరైన శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్*

దేవరకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని శ్రీగరుడాద్రి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం శ్రీగోదా రంగనాధుల తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదారంగనాథుల స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. భగవంతుని దీవెనలతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువై రాష్ట్ర అభివృద్ధి జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ గరుడాద్రి వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి, నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కల్యాణ మహోత్సవానికి దేవరకొండతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని తిలకించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ నిర్వాహకులు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆలంపల్లి నర్సింహ, డొడ్డి అశోక్, కోశాధికారి శిరందాసు కృష్ణయ్య, నిర్వాహకులు బెజవాడ శేఖర్, పానగంటి మల్లయ్య, చీదెళ్ల వెంకటేశ్వర్లు, డొడ్డి వెంకటేశ్వర్లు, భద్రయ్య, నక్క వెంకటేష్‌యాదవ్, వాస నారాయణ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో నిర్వహించిన గోదాదేవి కల్యాణంలో పాల్గొని మాట్లాడుతున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

మిర్యాలగూడ డివిజన్‌లో సోమవారం గోదారంగనాధుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గోదాదేవి రంగనాధులు కల్యాణతంతును సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తలంబ్రాలు, పట్టు వస్త్రాలు మేళతాళాలతో ఆలయం వద్దకు తీసుకొచ్చారు. స్వామి అమ్మవార్లకు కల్యాణాన్ని నిర్వహించి గోదాదేవి కల్యాణ విశిష్టతను తెలియజేశారు. నెల రోజుల పాటు తిరుప్పావై పూజలు నిర్వహించిన మహిళా భక్తులు ఆలపించిన పాటలు, సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మిర్యాలగూడలోని శ్రీ సాయి దత్త ఆశ్రమంలో గోదారంగనాధుల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. రైల్వేకాలనీ శ్రీసాయి దత్త ఆశ్రమం అష్టలక్ష్మి మందిరంలో కల్యాణ వేడుకలు నిర్వహించారు. రేగట్టె విక్రం సుకన్య దంపతులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారిమట్టయ్య, జానకిరాముడు, విక్రమ్, పద్మ, సీతాభవాని పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు చిలకమర్రి మురళీధరాచార్యులు, సీఎల్ఎన్.లక్ష్మణాచారి, నర్సింహాచారి, శేషగిరిరావు ఆధ్వర్యంలో గోదాదేవి రంగనాధులు కల్యాణతంతును సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శాగం పెద్దిరెడ్డి, నాయకులు శాగం శ్రవణ్‌కుమార్ రెడ్డి, శాగం అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు చిక్కం సోమిరెడ్డి, నల్లబోతు సైదులు, చంద్రమ్మ, సాలయ్య పాల్గొన్నారు.

హాలియాలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో చిట్టిపోలు యశ్వంత్‌ప్రీతి దంపతులు స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలను సమర్పించారు. పూజారులు వెంకటాచార్యులు, రమణాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో కాకునూరి నారాయణగౌడ్, చిట్టిపోలు యాదగిరి, వెంపటి శ్రీనివాస్, రవీందర్, రేపాల రమేష్, హేమంత్, రంజిత్, కోలాటం శంకర్, మహిళలు గార్లపాటి శోభ, చిట్టిపోలు పద్మ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులోని మల్లెలగట్టుపై గోదా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కుంభం మనోహర్‌రెడ్డి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.



దేవరకొండలో గోదా కల్యాణంలో పాల్గొన్న మహిళలు



హాలియాలో కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు



మిర్యాలగూడ శ్రీ సాయి దత్త ఆశ్రమంలో గోదారంగనాధుల కల్యాణోత్సవం



తిరుమలగిరి సాగర్‌లో కల్యాణం తిలకిస్తున్న భక్తులు

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

మిర్యాలగూడ రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లాపురం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బసవయ్యగౌడ్, పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, వెంకన్న, నాగయ్య, రామలింగయ్య, భిక్షం, మచ్చ సైదులు, బూర సైదులు, కనకయ్య, లక్ష్మీనారాయణ, రాజు, బ్రహ్మం, సైదిరెడ్డి, సుధాకర్, శ్రీధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గోపగాని మాధవి

మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సతీమణి బత్తుల మాధవి పాల్గొని మహిళలు వేసి ముగ్గులను వీక్షించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాయం రజిత ఉపేందర్‌రెడ్డి, అప్పనబోయిన వెంకటమ్మవెంకటయ్య, మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నక్క ఆశాలు, అప్పనబోయిన వెంకటయ్య, కారంపూడి రవి తదితరులు పాల్గొన్నారు.




బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ సతీమణి మాధవి

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

వేములపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం పనిచేస్తున్నారని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య అన్నారు. మండలంలోని మొల్కపట్నం గ్రామంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన రూ.5లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత దశాబ్దకాలంగా నిర్లక్ష్యానికి గురైన పల్లెలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పాదూరి కిరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ సెక్రటరీ పేరెల్లి నగేష్, పుట్టల శ్రీనివాస్, బారి పాండు, బొడ్డు జానకిరాములు, కొమ్మనబోయిన ఆంజనేయులు, రాచూరి వెంకన్న, చల్లబొట్ల శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, అర్జున్, సురేందర్, జానకిరాములు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

రైలులో అయ్యప్ప మాలధారులకు అన్నదానం

మిర్యాలగూడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దర్శనం కోసం శబరిమలకు వెళ్తున్న స్వాములకు రైలులో మిర్యాలగూడ కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి అల్పాహార, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో సోమవారం అయ్యప్ప మాల ధరించిన స్వాములకు సుమారు 1000 మందికి పులిమేడు ఆశ్రమ ప్రధాన గురుస్వామి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా తాను శబరియాత్ర చేస్తున్నానని అన్నారు. గత పదేళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను ఆదర్శంగా తీసుకుని పులిమేడు ఆశ్రమం ద్వారా భక్తులకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుణ్యక్షేత్రాల్లో భక్తులకు అన్నదాన, వస్త్రదాన కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 25వ వార్డు ఇన్‌చార్జి గోదాల జానకిరాంరెడ్డి, నాయకులు గొట్టిముక్కల లక్ష్మణ్, దప్పు శ్రీనివాస్, తాళ్ల వెంకట్‌రెడ్డి, కుప్పాల శ్రీనివాస్, మందడి రవీందర్‌రెడ్డి, రామారావు, బుల్లెట్ రాజా, శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఓరుగంటి శివ, యాదిరెడ్డి, రమేష్, కొండల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న పులిమేడు ఆశ్రమ ప్రధాన గురుస్వామి శేఖర్‌రెడ్డి

గడ్డివాము దగ్ధం

తిరుమలగిరి(సాగర్), జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త సొడబోయిన శ్రీనివాస్‌కు చెందిన రూ.లక్ష విలువైన గడ్డివాము సోమవారం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి శ్రీనివాస్, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బీవీ.రమణరాజు, నాయకులు నాగెండ్ల వెంకట్‌రెడ్డి, తేరా రాఘవరెడ్డి, చుక్క లచ్చయ్య, పుల్లం రాజు పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు

దామరచర్ల, దేవరకొండ, గుర్రంపోడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలో భోగి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున పలు కూడళ్లలో భోగి మంటలు వేశారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో భోగి పండుగ ప్రారంభమైంది. ఇంటి ముందు గొబ్బెమ్మలు, రంగవల్లులతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. చిన్నారులు గాలి పటాలను ఎగురవేస్తూ సందడి చేశారు. చిన్నారులకు భోగి పండ్లను పోశారు. ఇంటిం టికి తిరుగుతూ గంగిరెద్దులు చేసిన విన్యాసాలు ఆకర్షించాయి. పండుగకు వచ్చిన ఆడపడుచులతో ఇళ్లల్లో సందడి కనిపించింది. పిల్లలకు ఇష్టమైన తీపి, కారం వంటకాలను చేసి ఆరగించారు. భోగి కావడంతో నల్లనువ్వులతో పులుగ ప్రసాదాన్ని తయారు చేసి దేవునికి నైవేద్యం సమర్పించి అనంతరం భుజించారు. మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. దేవరకొండ డివిజన్‌తో పాటు, గుర్రం పోడులో భోగి పండుగ వేడుకలను ఆనందోత్సావాలతో నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామునే లేచి ఇంటి ముందు రంగు, రంగుల ముగ్గులు వేసి ఆవుపేడతో బొబ్బెమ్మలను పేర్చారు. ఇం టి ఎదుట భోగి మంటలు వేశారు.



దామరచర్ల : గంగిరెద్దుకు పూజలు చేస్తున్న చిన్నారి



హాలియాలో చిన్నారులకు భోగి పండ్లు

మహిళలకు అన్ని రంగాల్లో సగభాగం కల్పించాలి

హాలియా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు అన్ని రంగాల్లో సగభాగం వాటా కల్పించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. హాలియా మునిసిపాలిటీలోని 4వ వార్డులో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన యాంత్రీకరణతో పేద, బడుగు బలహీన వర్గాల మహిళలకు ఉపాధి లేక వీధిన పడుతున్నారని మునిసిపాలిటీ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీలు వర్తింపచేయాలన్నారు. ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐక్యతను పెంపొందించే రంగవల్లి కార్యక్రమాలను గ్రామ గ్రామాన నిర్వహించాలన్నారు. ప్రత్యక్షంగా, ప రోక్షంగా సహకరించిన దాతలు బ్రహ్మచారి, రమేష్, వీ రారెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేష్ తదితరులకు ధన్యవాదా లు తెలిపారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, రైతు సంఘం నాయకులు ఆవుల రాంరెడ్డి, రెవెల్లి వెంకటేశ్వర్లు, కారంపూడి ధనమ్మ, పొదిల వెంకన్న, కాట్నం వెంకన్న, రెడ్డిమల్ల సురేష్, విజయ, మహిళలు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

సెల్‌టవర్ సామగ్రి చోరీ కేసులో ఒకరి అరెస్టు

● *వాహన తనిఖీలో పోలీసులకు చిక్కిన దొంగ*

● *జిల్లాలో 16 చోరీల్లో ప్రమేయం*

మిర్యాలగూడ అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సెల్‌టవర్లను టార్గెట్ చేసి చాకచక్యంగా సామగ్రిని కాజేస్తూ పట్టుబడకుండా తిరుగుతున్న దొంగల ముఠాను పట్టుకునేందుకు పోలీసులు కొన్నాళ్లుగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం తెల్లవారు జామున మిర్యాలగూడ రూరల్ పోలీసులు వెంకటాద్రిపాలెం వద్ద వాహన తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ లోకేష్‌కుమార్ వివరాలు తెలిపారు. మిర్యాలగూడ మండలం ధీరావత్‌తండాకు చెందిన ధీరావత్ నవీన్ అనేవ్యక్తి కొంతకాలంగా డివిజన్ పరిధిలో సంచరిస్తూ గ్రామశివారులో ఉన్న సెల్‌టవర్ల సామగ్రి చోరీకి పాల్పడుతున్నట్లుగా గుర్తించామన్నారు. ఈనెల 4వ తేదీన ఐలాపురం గ్రామశివారులో ఎయిర్‌టెల్ సెల్‌టవర్‌కు చెందిన రేడియో రిమోట్ యూనిట్ (ఆర్ఆర్‌యూ) పరికరాల చోరీకి పాల్పడినట్లు నిందితుడు నేరం అంగీకరించాడు. గత ఏడాది జూన్, జూలై మాసాల్లో శ్రీనివాసనగర్, నందిపాడు గ్రామాల శివారులోని ఎయిల్‌టెల్ సెల్‌టవర్ల ఆర్ఆర్ యూనిట్లను చోరీ చేసినట్లుగా తమ విచారణలో తేలిందన్నారు. కొన్నాళ్లుగా సెల్‌టవర్ల ఆర్ఆర్‌యూనిట్లను చాకచక్యంగా కాజేసి, వాటిని హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ముచేసుకుని జల్సాలు తీర్చుకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నేరాల్లో పెన్‌పహాడ్ మండలం ధర్మాపురం తండాకు చెందిన లకావతు వెంకన్న అనే స్నేహితుడితో కలిసి చోరీలకు పాల్పతున్నాడు. ఐలాపురం గ్రామశివారులోని సెల్‌టవర్ ఆర్ఆర్ యూనిట్లను దొంగిలించి శ్రీనివాసనగర్ గ్రామశివారులోని చెట్ల పొదలో దాచిపెట్టి హైదరాబాద్‌లో విక్రయించేందుకు సోమవారం తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై తరలిస్తూ తమకు పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. సెల్‌టవర్ సెక్యూరిటీ గార్డు యాకూబ్‌పాషా ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అతని వద్ద నుంచి రూ.2.50 లక్షల విలువైన ఆర్ఆర్ యూనిట్లు, చోరీలకు ఉపయోగించే కట్టర్, స్పానర్‌లతో పాటు ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో నిందితుడు లకావతు వెంకన్న పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే పోలీసులకు చిక్కిన నవీన్‌పై మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు కేసులు నమోదై ఉండగా, జిల్లాలోని కొండమల్లేపల్లి, చింతపల్లి, తిరుమలగిరిసాగర్, నిడమనూరు, నేరేడుగొమ్ము, మాడ్గులపల్లి, దేవరకొండ, వేములపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో మరో 11 చోరీ కేసులు నమోదై ఉన్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. వరుస చోరీలకు పాల్పడుతున్న నవీన్‌పై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ లోకేష్‌కుమార్

అదుపుతప్పి కారు బోల్తా

మిర్యాలగూడ అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లైఓవర్ వంతెనకు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. మిర్యాలగూడ పట్టణంలోని పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... సంక్రాంతి వేడుకల కోసం ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్ నుంచి స్వస్థలమైన గుంటూరుకు కారులో బయల్దేరారు. మార్గం మధ్యలో మిర్యాలగూడ పట్టణ సమీపంలోని హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వంతెనకు సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సిమెంటు ది దిమ్మెను ఢీకొట్టి బోల్తాపడింది. వెంటనే కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. కారు డోర్లు ఓపెన్ కాకపోవడంతో స్థానికుల సహాయంతో పోలీసులు ఇద్దరు వ్యక్తులు అతికష్టం మీద బయటకు తీశారు. ఇద్దరు వ్య క్తులకు కూడా ఎలాంటి గాయాలు కాలేదు. సంఘటనా స్థలానికి చేరుకున్న టూటౌన్ సీఐ నాగార్జున ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

లావూడితండాలో ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

మిర్యాలగూడ రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని లావూడితండాకు చెందిన ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం శ్రీనివాస్‌నగర్‌లోని కేఎస్‌పీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. లావూడితండా గ్రామంలో పుట్టి పెరిగి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్న 105 కుటుంబ సభ్యులు సమ్మేళనంలో పాల్గొన్నారు. లావూడితండా ఉద్యోగులు గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వడం, కరోనా సమయంలో బాధిత కుటుంబాలకు కరోనా కిట్లు పంచడం, జాగ్రత్తలు సూచించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్మించడంలో ఉద్యోగులు కృషి చేశారు. కార్యక్రమంలో లావూడితండా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి కోట వరలక్ష్మి, బాలాజీ, చందు, ఏఎస్ఐ విజయకాంత్, లింగరాజ్‌యాదవ్, గోవింద్, సైదానాయక్, నాగేందర్‌బాబు, రాజా, భగవాన్ నాయక్, భూపతి, చీను తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఊరెళ్లే వారు సమాచారం ఇవ్వాలి

నర్సింహులు, సీఐ, దేవరకొండ



సంక్రాంతి పండగకు ఇంటికి తాళం వేసి ఊరెళ్లే వారు విలువైన వస్తువులు, ఆభరణాలు, నగదు ఇంట్లో పెట్టి వెళ్లవద్దని, ఇరుగు, పొరుగువారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: దేవరకొండ పట్టణంతో పాటు మండలంలో దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ నిర్వహించి అన్ని చర్యలు చేపడుతున్నాం. పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశాం. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం.

ఆంధ్రజ్యోతి: సంక్రాంతి పండగకు ఊరెళ్లే వారికి చేసే సూచనలేంటి?

సీఐ: సంక్రాంతి పండగకు ఇంటికి తాళం వేసి ఊరెళ్లే వారు విలువైన వస్తువులు, నగదు, బంగారం ఇంట్లో దాచిపెట్టి వెళ్లవద్దు. ఇరుగు, పొరుగు వారితో పాటు పోలీసులకు కూడా సమాచారం ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో గొడవలు జరగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: దేవరకొండ పట్టణంతో పాటు గ్రామాల్లో యువకులు గొడవలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో కలిసి మెలిసి పండగ నిర్వహించుకోవాలని సూచించాం. దేవరకొండతో పాటు తాటికోలు గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ఘర్షణలకు, వివాదాలకు పాల్పడే వారిపై నిఘా ఏర్పాటు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఆన్‌లైన్ మోసాలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, ఖాతా నెంబర్లు అడిగితే ఇవ్వవద్దు. సైబర్ నేరాలపై ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. సమస్యలు ఉంటే 100 నెంబర్‌కు ఫోన్ చేయాలి.

పేకాట స్థావరంపై దాడి

● *ఐదుగురు అరెస్ట్*

వేములపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రావులపెంట గ్రామంలో ఐదుగురు ట్రాక్టర్ డ్రైవర్లు గ్రామంలోని పశువైద్యశాల వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి వారిని పట్టుకున్నట్లు ఆ యన తెలిపారు. వారి నుంచి రూ.1500 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

వేములపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో ఒకరు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన వేములపల్లిలో ఈనెల 10వ తేదీన చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ పట్టణం శాంతినగర్ కాలనీకి చెందిన కూరెళ్లి విజయ్ రైస్ మిల్లులో గుమాస్తాగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. కొద్ది రోజుల క్రితం గుమాస్తా ఉద్యోగం పోవడంతో పని లేక తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన ఉదయం 5 గంటల సమయంలో మంచినీరు తీసుకొస్తానని స్కూటీపై ఇంటి నుంచి బయలుదేరాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో ఇంట్లో చూడగా నీళ్ల క్యాన్లు సైతం ఇంట్లో ఉండటంతో అనుమానం వచ్చి అతని మొబైల్‌కు ఫోన్ చేశారే. ఆ మొబైల్ ఇంట్లోనే ఉందన్నారు. దీంతో అనుమానం వచ్చి సమీప బంధువులకు ఫోన్ చేయడంతో పాటు పట్టణంలో వెతకగా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో అనుమానంతో వెతుక్కుంటూ వేములపల్లి సాగర్ ఎడమకాల్వ వద్దకు చేరుకోగానే సాగర్ ఎడమకాల్వ బ్రిడ్జి వెంట అతని స్కూటీ కనిపించిందన్నారు. దీంతో అనుమానంతో నాలుగు రోజులుగా కాల్వ వెంట వెతికినా ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదన్నారు. దీంతో విజయ్ భార్య కవిత ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని విజయ్ ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.



విజయ్ (ఫైల్ ఫోటో)